05ATP12_05ATP12.qxd 12-01-2026 PM 11:11 Page 1



## సమస్యలు పరిష్కరించాలని బ్యాంక్ మేనేజర్‌కు వినతి

**యాడికి, జనవరి 12 ప్రభాతవార్త**



వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు పాతకుట్ల బాలు మాదిగ యాడికి కెనరా బ్యాంక్ మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా యాడికి మండల కేంద్రంలో కెనరా బ్యాంకు పక్కన ఉన్న కెనరా ఏటీఎం పనిచేయడం లేదని దీనివల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్యవసరంగా డబ్బులు కావాల్సిన వాళ్ళ ఖచ్చితంగా బ్యాంకులోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని కనుక ప్రజలు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని కెనరా ఏటీఎం త్వరగా మరమ్మతులు చేయించాలన్నారు. యాడికి కెనరా బ్రాంచ్‌లో డబ్బులు జమ చేయడానికి, డబ్బులు తీసుకోవడానికి వేరువేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. రైతులకు వ్యవసాయ లోన్లు ఇచ్చేటప్పుడు మరియు రెన్యువల్ చేసేటప్పుడు రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని వారికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి చిరంజీవి మాదిగ, సూరి మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గరామలింగేశ్వరునికి పంచామృతాభిషేకాలు

**తాడిపత్రిటౌన్, జనవరి 12 ప్రభాతవార్త**



తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గ రామలింగేశ్వరస్వామికి సోమవారం ఆలయ అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మలు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు నందుస్వామి, రామకృష్ణశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్‌నాయుడు, కమిటీ సభ్యులు రంగనాథరెడ్డి, సిబ్బంది విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## పుట్లూరు చెరువుకు నీరు విడుదల

**- మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ**

**పుట్లూరు, జనవరి 12 ప్రభాతవార్త**

పుట్లూరు మండలంలోని సుబ్బరాయసాగర్ నుండి పుట్లూరు చెరువులకు గత సంవత్సరం నవంబర్ 13న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడం జరిగింది. అయితే గేట్లు పూర్తి స్థాయిలో పైకి లేవకపోవడం, నీరు వృధా కాకుండా బొప్పేపల్లి చెరువుకు పంపడం జరిగింది. కాగా ఈ ఏడాది పుట్లూరు మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు నీరు అందించడం అసంభవం అనుకొన్నవారికి మేమున్నామంటూ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి రైతుల కష్టాలను జిల్లా అధికారులకు వివరిస్తూ సుబ్బరాయసాగర్‌కు రెండో సారి నీటిని నింపి పుట్లూరు చెరువుకు నీటిని విడుదల చేయడంపై మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీటి విడుదల గురించి ఎన్ని ఆరోపణలు చేసినా రైతుల శ్రేయస్సు కోసమే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెదేపా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎల్‌సి అధికారులు సుధాకర్‌రావు, సూర్యనారాయణ, పార్థసారధి, శ్రీనివాసులు, తెలుగుదేశంపార్టీ నాయకులు శ్రీనివాసుల నాయుడు, చవ్వా కులశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రాజు, సత్యనారాయణరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రామానాయుడు, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం

**తాడిపత్రిరూరల్, జనవరి 12 ప్రభాతవార్త**



తాడిపత్రి మండలం ఓబులేసుకోనలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింస్వామి కళ్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్ష త్రం స్వాతినక్ష త్రాన్ని పురస్కరించుకుని ఉదయం అర్చకులు యోగానందశర్మ స్వామివారికి సుప్రభాతసేవ, నవకలశ స్నపన, తిరుమంజనసేవ, తోమాలసేవ, సహస్రనామార్చానసేవ, మహా నివేదన శాత్తుమొరై, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగము, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవం, ప్రాకారోత్సవం, తదితర పూజా కార్య క్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## ఎల్‌ఐసి ఏజెంట్‌కు అరుదైన గుర్తింపు



ఏజెంట్‌ను సన్మానిస్తున్న బ్రాంచ్ మేనేజర్

**తాడిపత్రిఅర్బన్, జనవరి 12 ప్రభాతవార్త**

ఎల్‌ఐసిలో ఏజెంట్‌గా చేరిన పది నెలల్లో 46 లక్షల రూపాయల ప్రీమియం డబ్బులు పాలసీదారులతో కట్టించి అరుదైన ఎండిఆర్‌టి (మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్ సమావేశం)లో అర్హత పొందిన మహిళ ఎల్‌ఐసి ఏజెంట్‌గా తాడిపత్రికి చెందిన కె.వి శివలక్ష్మి గుర్తింపు సంపాదించారు. 2025లో ఎల్‌ఐసి ఏజెంట్‌గా చేరిన శివలక్ష్మి డవలప్‌మెంట్ ఆఫీసర్ నరసింహసాయికిరణ్ సహకారంతో డిసెంబర్ నెలలో 19 లక్షల రూపాయల ప్రీమియంను కట్టించారు.

ఎండిఆర్‌టిగా గుర్తింపు పొందిన కెవి శివలక్ష్మి సన్మాన కార్యక్రమాన్ని సోమవారం ఎల్‌ఐసి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డవలప్‌మెంట్ ఆఫీసర్ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతో కలిపి ఒకే ఒక ఏజెంట్‌గా శివలక్ష్మి ఎంపికయ్యారన్నారు. ఎల్‌ఐసి పాలసీ చేయించాలంటే ఏజెంట్లు స్ట్రాంగ్‌గా వుండాలన్నారు. ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఎండిఆర్‌టి అర్హత పొందిన వారికి అమెరికాలో జూన్‌లో సమావేశం ఏర్పాటు చేస్తారని దానికి కెవి శివలక్ష్మి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, ఏజెంట్లు పాల్గొన్నారు.

ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో

## గత 18 సంవత్సరాలుగా ప్రతి సంక్రాంతికి పెళ్లి కానుకలు పంపిణీ చేస్తున్నాం

**- ఎంపీటీసీ మహబూబ్ బీ, ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ అధ్యక్షులు సాదిక్ వలి.**



నూతన వధూవరులకు పెళ్లి కానుకలు పంపిణీ చేస్తున్న దృశ్యం.

**అనంతపురం రూరల్, జనవరి 12 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు నగర్ ఎమ్మెస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నూతన వధూవరులకు పెళ్లి కానుకలు గోద్రెజ్ బీరువా, గోద్రెజ్ మంచం, ఫ్యాన్లను ఎంపీటీసీ మహబూబ్ బీ, చేతులు మీదుగా నూతన వధూవరులు షేక్ తస్లీమ్, షేక్ దాదా కలందర్ కుఅందజేశారు. ఈ సందర్భంగావారుమాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నూతన వధూవరులకు పెళ్ళికానుకలు పంపిణీ చేయడం జరుగుతుందని, అందులో భాగంగా నే ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా సంక్రాంతి పండుగ సందర్భంగా నూతన వధూవరులకు పెళ్లి కానుకలుపంపిణీచేశామన్నారు. ఈకార్యక్రమంలో రుద్రం పేట పంచాయతీ మాజీ సింగల్ విండో ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, వైయస్సా ర్సీపి పంచాయతీ రాజ్ విభాగం జాయింట్ సెక్రెటరీ, ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ అధ్యక్షులు సాదిక్ వలి,ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు

## మహిళలకు ఇస్త్రీ పెట్టెలు పంపిణీ



ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేస్తున్న విఆర్ రామిరెడ్డి

**తాడిపత్రిటౌన్, జనవరి 12 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలో వైసిపి మాజీ సమన్వయకర్త విఆర్ రామిరెడ్డి, విఆర్ వెంకటేశ్వర్‌రెడ్డిలు సోమవారం రజక మహిళలకు 40 వేల రూపాయల విలువచేసే 20 ఇస్త్రీ పెట్టెలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విఆర్ రామిరెడ్డి మాట్లాడుతూ రజకుల వృత్తి రోజురోజుకు దయనీయ పరిస్థితిగా ఉందన్నారు. రజకులను మన రాష్ట్రంలో ఎస్‌సి జాబితాలో చేరుస్తామని గత ఎన్నికల సమయంలో చెప్పడం జరిగిందన్నారు. రాష్ట్ర జనాభాలో 6.8 శాతం రజకులు ఉన్నారు. మనదేశంలో 17 రాష్ట్రాలు రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారు. కావున ప్రభుత్వం రజకులను ఎస్‌సి జాబితాలో చేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రజక సూరి, రజక పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పాలపాటిదిన్నేలో వేలంపాట నిర్వహణ



వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

**నల్లచెరువు, జనవరి 12, (ప్రభాత వార్త):**

మండల పరిధిలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి దేవస్థానం యందు సోమవారం దేవా దయ ధర్మాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి ఎన్ ప్రసాద్, పుట్టపర్తి సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వేలం నిర్వహణ నిర్వహించారు టెంకాయలు పూజాసామాగ్రి, పూలహారాలు విడిపూలు బొమ్మలు దారాలు విక్రయినకుకొను హక్కునకు వేలము పాట ఈ వేలం పాటలో 1. టెంకాయలు పూజా సామాగ్రి (పి. గంగులప్ప 3,80,000/) (2) పూలహారాలు జి. హరినాథ్ 33,000/) (3. బొమ్మలు దారాలు విక్రయించుకొను హక్కునకు గాను ఎం. ప్రభాకర్ 67,000/) వేలం పాట పాడి పాట దక్కించుకున్నారు ఈ కార్యక్రమములో ఆలయ అర్చకులు ప్రధాన అర్చకులు ఆంజనేయులు దాస్, నాగరాజు దాసు, సిబ్బంది మరియు భక్తాధులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

**అమడగూరు, జనవరి 12 ప్రభాతవార్త**




వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేసిన దృశ్యం

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలోని పరిపాలన అధికారి లోక మల్లికార్జున్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అదేవిధంగా ఆయన తండ్రి జ్యోతిరెడ్డి జ్ఞాపకార్థం మండలంలోని గాజులపల్లి వద్ద వున్న శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ మునెప్ప ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లోక మల్లికార్జునరెడ్డి కుటుంబ సభ్యులు, రంగయ్య, తదితరులు హాజరై జ్యోతిరెడ్డి ఆత్మకు శాంతి కలగాలని ఆ దేవుని ప్రార్థిస్తూ అదేవిధంగా లోక మల్లికార్జునరెడ్డికి వృద్ధుల తరపున ఆశ్రమం తరపున జన్మదిన శుభాకాంక్షలను ఆశ్రమ నిర్వాహకురాలు అరుణ్‌జ్యోతి తెలియజేశారు.

## కొనసాగుతున్న జెసి క్రికెట్ టోర్నమెంట్ సీజన్-4



బహుమతి అందచేస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, జనవరి 12 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న జె.సి క్రికెట్ టోర్నమెంట్ సీజన్-4 కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌ల వివరాలు ఇలా వున్నాయి. మొదటి మ్యాచ్ జూటూరు వర్సెస్ పెద్దవడుగూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పెద్దవడుగూరు జట్టు విజయాన్ని సాధించింది. మూడవ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ నెక్స్ జెన్ క్రికెట్ అకాడమీ వర్సెస్ ఆల్ దూహిల్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెక్స్ జెన్ క్రికెట్ అకాడమీ జట్టు గెలుపొందింది. నాల్గవ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ సాయి లెవెన్స్ పెద్దవడుగూరు వర్సెస్ పెద్దపప్పూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పెద్దవడుగూరు జట్టు విజయం సాధించింది.

## యువత సరైన దారిలో నడిస్తేనే దేశాభివృద్ధి

**- ఆదర్శ విద్యాసంస్థల్లో జాతీయ యువజన దినోత్సవం**



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

**గోరంట్ల, జనవరి 12 ప్రభాతవార్త**

స్థానిక శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలల్లో సంయుక్తంగా జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు ప్రసంగిస్తూ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవం దేశం భవిష్యత్తును ఆలోచింపచేసే ఒక గొప్ప సందర్భం అని, సమాజాన్ని మార్చగల సామర్థ్యం యువతలో దాగి ఉందని, యువత సరైన దారిలో నడిచినప్పుడే దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని తెలిపారు. బలమైన శరీరం, బలమైన మనస్సు నైతిక విలువలతో కూడిన జీవితం ఉన్నప్పుడే యువత ఉత్తమ పౌరులుగా ఎదగగలుగుతారన్నారు. కెరటం నా ఆదర్శం లేచి పడుతున్నందుకు కాదు పడినా లేస్తున్నందుకు, మందలో ఒకడిగా కాకుండా వందలో ఒకడిగా ఎదగాలని వివేకానందుడు చెప్పిన మాటలను ఆదర్శంగా తీసుకుని యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ భక్తవత్సలం తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాలల విద్యార్థులు, శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్‌పిఒలు అజాద్, బాలమోహన్, అరవింద, నందగోపాల్, హరీష్‌బాబు, ధనమ్మ, నౌరీన్, శ్వేతా, పాల్గొన్నారు.

## క్రైస్తవులపై దాడులను అరికట్టాలని శాంతి ర్యాలీ

**ఆర్డీవోకి వినతి పత్రం అందజేసిన క్రైస్తవులు**

**పెనుకొండ జనవరి12 (ప్రభాతవార్త)**



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న క్రైస్తవులు

క్రైస్తవులపై దాడులను అరికట్టాలని క్రైస్తవులు పెనుగొండ పట్టణము నందు శాంతియుత ర్యాలీ నిర్వహించి, స్థానిక ఆర్ డి ఓ ఆనంద్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం కొర్రకోడు గ్రామంలో క్రైస్తవుల పై జరిగిన దాడిని ఖండిస్తూ పెనుకొండ నియోజకవర్గంలో ఉన్న క్రైస్తవులు దాడిని ఖండిస్తూ సోమవారం స్థానిక పెనుకొండ అంబేద్కర్ సర్కిల్ నందు శాంతిర్యాలీ నిర్వహించి క్రైస్తవులపై జరిగిన దాడులను ఖండించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు మద్దతుగా బహుజన చైతన్య వేదిక బృందం సభ్యులు పాల్గొని ఆర్డిఓ లిఖితపూర్వకముగా వినతిని అందజేశారు. ఈ సందర్భంగా బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ మాట్లాడుతూ దాడి వారిని కఠినంగా శిక్షించాలంటూ ఆర్డిఓ ఆనంద్ కుమార్ కి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మీ ఫిర్యాదును సంబంధిత అధికారులకు ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఈనెల4తేదీ ఆదివారం అనంతపురం జిల్లా కూడేరు మండలం కొరకోడు గ్రామానికి అనంతపురం జిల్లా గాస్పల్ హాల్ చర్చికి సంబంధించిన క్రైస్తవులు కొంతమంది ప్రార్థనకు వెళ్లడం జరిగింది. అయితే కొంత మంది గ్రామస్తులు క్రైస్తవులపై దాడి చేసి గాయపరిచి బస్సు అద్దాలను ధ్వంసం చేసి, విచక్షణ రహితముగా దాడి చేసి భయభ్రాంతులకు గురిచేసి కట్టెలు, రాళ్లతో దాడి చేస్తూ భయభ్రాంతులకు గురి చేయడం జరిగింది అని తెలిపారు. ఈ హేయమైన సంఘటనను ఖండిస్తూ సువార్త ప్రకటిస్తున్న పాస్టర్లపై చర్చిలపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేయడం మంచి పద్ధతి కాదని, భారత రాజ్యాంగంలో మత స్వేచ్ఛ స్వాతంత్రపు హక్కును కొంతమంది తెలియని వారు అడ్డుకోవడం మంచి పద్ధతి కాదని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా భారతదేశంలో నివసిస్తున్న మనమందరం సోదర భావంతో కలిసి మెలిసి ప్రేమ కలిగి జీవించాలని తెలియజేశారు. రాబోవు రోజుల్లో ఇలాంటి సంఘటనలు జరగకుండా క్రైస్తవులకు రక్షణ కల్పించాలని తెలిపారు. శివరామకృష్ణ మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరూ జీవించే హక్కు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం ఎవరికి నచ్చిన మతం వారు ప్రకటించవచ్చు, స్వీకరించవచ్చుని, కాబట్టి ప్రజలు జీవించే హక్కు ఎవరు కూడా ఆటంకపరచకూడదని వారు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో పరిగి మండలం పాస్టర్ పాల్ తిమోతి, బైబిల్ మిషన్ చర్చ్ పాస్టర్ సుధాకర్, రొద్దం బిషప్ ఎలీఫాజ్, జిప్సీ పాస్టర్ మోజస్ నాయక్, చిన్నమంతురు సీయోను మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ సొలొమోన్, పెనుకొండ హోరేబు ప్రార్థనా మందిరం పాస్టర్ రాజబాబు, అంజనప్ప, బహుజన చైతన్య వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్, యంగ్ ఇండియా వెంకటేశులు, క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంద్రూస్, గోపాల్ , జోసఫ్, మహేష్, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చర్చి పాస్టర్లు చర్చి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తాగుడుకు బానిసై బసవరాజు ఆత్మహత్య

**బ్రహ్మసముద్రం జనవరి 12 ప్రభాతవార్త**



చనిపోయిన బసవరాజు మృతదేహం

బ్రహ్మసముద్రం మండలం పరిధిలోని చెలిమేపల్లి గ్రామంలో గొల్ల బసవరాజు, వయస్సు 39 సం;రాలు తండ్రి పేరు గొల్ల కదరప్ప, మద్యం త్రాగుటకు బానిసై మరియు కుటుంబ కలహాలు తో జీవితం పై విరుక్తి చెంది చనిపోవాలని ఉద్దేశం తో ఇంట్లో ఎవరు లేని సమయములో ఊరి వేసుకొని చనిపోయినట్టు ఎస్సై సాయికుమార్ తెలిపారు పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణ్ దుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

## బిజెపి యువమోర్చా ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి



మొక్కలు నాటుతున్న బిజెపి నాయకులు

**పెనుకొండ జనవరి 12 (ప్రభాతవార్త)**

బిజెపి జాతీయ, రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం బిజెపి యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు సునీల్ కుమార్ రెడ్డి, సత్యసాయి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ , యువ మోర్చా జిల్లా అధ్యక్షులు బిల్లుకులాయప్ప యాదవ్ సూచన మేరకు పెనుకొండ పట్టణం లోనీ అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద బిజెపి యువ మోర్చా ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 164వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని సంజీవని వనం నందు మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ బిజెపి నాయకులు రామకృష్ణ, రామాంజనేయులు, రవి, గోవింద్ ,సుభద్రమ్మ హనుమంతు, మరియు యువ నాయకులు హరీష్, ధనుంజయ్, కిష్ట ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ట్రాక్‌మ్యాన్ మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డుతో సత్కారం..

**గుంతకల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా**



మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డుతో శివ కృష్ణను, సత్కరించిన గుప్తా

**గుంతకల్ రైల్వే జనవరి 12 ప్రభాత వార్త**

గుంతకల్ రైల్వే డివిజన్ పరిధిలోని జంగాలపల్లె వద్ద ట్రాక్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్న శివ కృష్ణ చూపిన అప్రమత్తత, సమయస్ఫూర్తి మరియు రైల్వే భద్రత పట్ల నిబద్ధతకు డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డుతో సత్కరించారు. శివ కృష్ణను తన అత్యుత్తమ అప్రమత్తత మరియు విధి పట్ల అంకితభావాన్ని గుర్తిస్తూ రాత్రి విధులు నిర్వహిస్తున్న సమయంలో శివ కృష్ణ ట్రాక్‌పై ప్రశంసించారు. సమయస్ఫూర్తితో ఫెయిల్యూర్‌ను గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ఆయన సమయోచిత చర్యల వల్ల తక్షణమే సరిదిద్దు చర్యలు చేపట్టబడినవి మరియు ఏవైనా అనుకోని ప్రమాదాలు సంభవించకుండా విజయవంతంగా నివారించబడి నందున రైలు భద్రత నిర్ధారించి ఇలాంటి ఉన్నత విధి ప్రమాణాలు మరియు బాధ్యతా భావాన్ని సిబ్బంది అందరూ అనుసరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడిఆర్ఎం యు. సుధాకర్, కోఆర్డినేషన్ జి. డి.ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సేవల్లో వేగం, పారదర్శకత తప్పనిసరి

**- జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్**



రెవెన్యూ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జెసి ఎం.మౌర్యభరద్వాజ్

**పుట్టపర్తి, జనవరి 12, ప్రభాతవార్త**

ప్రజలకు నేరుగా సంబంధించిన రెవెన్యూ సేవల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా వేగంగా, పారదర్శకంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్ పుట్టపర్తి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో పుట్టపర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులు, సిబ్బందితో పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్స్, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, రెవిన్యూ రికార్డుల నిర్వహణ, రీ సర్వే, జాయింట్ ఎల్పిఎమ్స్, పౌర సరఫరాలు నిత్యవసర వస్తువుల పంపిణీ, దీపం గ్యాస్ పంపిణీ, తదితర వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సమిష్టి బాధ్యతతో పనిచేయాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా అధికారులు విధులు నిర్వహించాలన్నారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులు, రెవెన్యూ క్లినిక్స్ ద్వారా వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ముఖ్యంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని, అర్హులైన రైతులందరికీ పాస్ పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రెవెన్యూ రికార్డుల సక్రమ నిర్వహణ, రీసర్వే పనులు నాణ్యతతో పూర్తిచేయడం, జాయింట్ ఎల్పీఎంలకు సంబంధించిన అంశాలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని అన్నారు. భూ సంబంధిత సమస్యలు రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. పౌర సరఫరాల శాఖ ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ, దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్ల పంపిణీ సజావుగా జరిగేలా పర్యవేక్షణ పెంచాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ, సర్వే శాఖ ఏడి విజయశాంతి, జిల్లా పౌర సరఫరాల అధికారి వంశీకృష్ణ రెడ్డి, తాసిల్దార్లు, డిప్యూటీ తహాశీల్దారులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## జన స్వరం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



జనస్వరం నూతన క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**కొత్తచెరువు జనవరి 12 ప్రభాతవార్త**

కొత్తచెరువు మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం పుట్టపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ ఆధ్వర్యంలో రూపొందించిన జన స్వరం నూతన క్యాలెండర్ ను జన సైనికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు ఈ సందర్భంగా చైర్మన్ శివప్రసాద్ మాట్లాడుతూ జనసేన పార్టీ వ్యవస్థాపకులు కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ చేపట్టిన కార్యక్రమాలు అన్నింటిని ప్రస్తావిస్తూ జనస్వరం నూతన సంవత్సర క్యాలెండర్ రూపొందించడం జరిగిందన్నారు. ఈ క్యాలెండర్ ద్వారా జనసేన పార్టీ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ప్రచారం జరుగుతుందని తెలిపారు అదేవిధంగా తన తరఫున పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలకు కూటమి నాయకులకు మరియు జనసైనికులు అందరికీ భోగి, సంక్రాంతి మరియు కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ నారాయణస్వామి మండల ప్రధాన కార్యదర్శి హనుమంతు నాయక్, రెడ్డప్ప ,గూడ మధు, సోమశేఖర్ పూల వెంకటేష్ నాగమణి ముత్త నాగేంద్ర చింతల ప్రసాద్ సమ్మిటి నవీన్ విశ్వనాథ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

**పావగడ, జనవరి 12 ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగ ను పురస్కరించుకొని పావగడలో హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో అక్షయ బ్లూజెమ్ మాంటిస్సోరి స్కూల్ ఆవరణంలో ముగ్గుల పోటీని నిర్వహించారు. ముగ్గుల పోటీలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు సీఐ సురేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ మానం వెంకటస్వామి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ సొసైటీ అధ్యక్షులు మానం శశికిరణ్, సంధ్య, బాలు, బేకరీ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గులను వీక్షిస్తున్న సిఐ సురేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ మానం వెంకటస్వామి →



06ATP27_06ATP27.qxd 12-01-2026 PM 10:22 Page 1



## అగళి మండలంలో ప్రత్యేకంగా ముగ్గుల పోటీలు

**- ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలందరికీ చీరలు**


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పిటిసి ఉమేష్

**అగళి, జనవరి 12 ప్రభాతవార్త**

అగళి మండలంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రత్యేకంగా ముగ్గుల పోటీలను, ఆవులు, ఎద్దుల ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు జడ్పిటిసి ఉమేష్ తెలిపారు. ఈ నెల 14వ తేది ఉదయం 9 నుంచి 10:30 గంటలలోపు ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలు పేర్లు నమోదు చేసుకోవాలని ఏటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనేవారు అగళి మండలానికి చెందిన వారై ఉండాలని, 18 సంవత్సరాలు పైబడిన వారై ఉండాలని తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ఆధార్, రేషన్‌కార్డు జెరాక్స్‌తో పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ ముగ్గుల పోటీ కార్యక్రమం అగళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 14వ తేది నిర్వహిస్తామని తెలిపారు. ముగ్గుల పోటీల్లో ప్రథమస్థానం పొందిన మహిళకు 5వేలు న గదుతోపాటు పట్టు చీర, ద్వితీయ బహుమానంగా 4వేలు, పట్టు చీర, తృతీయ బహుమతిగా 3వేల నగదు, పట్టు చీర, 4వ బహుమతి ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి 1000 నగదు, పట్టు చీరను పంపిణీ చేయనున్నట్లు జడ్పిటిసి ఉమేష్ తెలిపారు. అదే విధంగా రైతులు ఎద్దులు, ఆవుల ప్రదర్శన చేయాలని, చేసిన ప్రథమ బహుమతి పొందిన రైతుకు రూ.3వేలు నగదు, ఒక జత బట్టలు, ద్వితీయ బహుమతి పొందిన వారికి 2వేలు నగదు, బట్టలు పంపిణీ చేస్తామని, తృతీయ బహుమతి పొందిన వారికి 1000 నగదు, బట్టలు పంపిణీ చేస్తామని తె లిపారు. ఈ ముగ్గులపోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ఒక్కో చీర ప్రకారం 14వ తేది పంపిణీ చేయనున్నట్లు జడ్పిటిసి ఉమేష్ తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళా మణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా రైతులు ఎద్దులు ఆవుల ప్రదర్శనను చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కుంటిమద్దిలో చోరీ

**రామగిరి, జనవరి 12 ప్రభాతవార్త**

మండల పరిధిలోని కుంటిమద్ది గ్రామంలో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా తెలిసింది. కుటంటిమద్ది గ్రామానికి చెందిన సాలమ్మ ఇంటిలో వెండివస్తువులు, జత కమ్మలు చోరీ జరిగినట్టు రామగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 10వ తేది రాత్రి ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని దొంగలు ఇంటిలోని వెండి వస్తువులు, జతకమ్మలు ఎత్తుకెళ్లినట్టు బాధితురాలు సోమవారం రామగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం ఇంటి తలుపులు కొద్దిగా తెరచి ఉండటంతో అక్కడున్న బంధువులు గమనించి ఇంటిలోకి వెళ్లి చూడగా ఇంటిలో వస్తువులన్నీ చెల్లా చెదురుగా ఉండటంతో సాలమ్మకు ఫోన్ చేసి సమాచారం అందించారన్నారు. సాలమ్మ కుటుంబ సభ్యులు బెంగుళూరులో ఉండటంతో ఇంటికి తాళం వేశారు. దీనిని గమనించిన దొంగలుల ఇంటిలో ఎవరు లేరని చోరీ చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

**అమరాపురం జనవరి 12: ప్రభాతవార్త**


స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన అమరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి సోమవారం వివేకానంద జయంతి సందర్భంగా నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ టీఎన్ టియుసి ఉపాధ్యక్షుడు చిట్నాడుకు మహాలింగప్ప ఆధ్వర్యంలో పూలమాలలు వేసి జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిఎన్టియుసి ఉపాధ్యక్షుడు చిట్నాడుకు మహాలింగప్ప మాట్లాడుతూ ప్రపంచానికి ఆధ్యాత్మిక విలువలను చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. భారతదేశంలో యువతకు స్వామి వివేకానంద బోధనలు ఎప్పుడూ స్ఫూర్తినిస్తాయన్నారు. ఆయన ప్రసంగాలు యువకుల్లో చైతన్యం నింపుతాయన్నారు. స్వామి వివేకానంద జయంతి రోజైన జనవరి 12న జాతీయ యువజన దినోత్సవం, నేషనల్ యూత్‌డే నిర్వహించాలని 1984లో భారతప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 1985నుంచి ఏటా వివేకానందుడి ఆదర్శాలు కొనసాగేలా యువజన దినోత్సవం జరుపుకుంటున్నాం. జనవరి 12వ రోజును యువ దివస్ అని కూడా పిలుస్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ కంప్యూటర్ ఆపరేటర్ ఎన్ మూర్తి, ఓబులేశు, మంజునాథ్ మరియు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు

**ధర్మవరంటౌన్, జనవరి 12 ప్రభాతవార్త**


బాలికలకు బహుమతులను అందజేస్తున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప

పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణం లో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టూటౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలు చరితకు ప్రథమ బహుమతి, నిహాన్వెంకట్కు ద్వితీయ బహుమతి, జయశ్రీకి తృతీమ బహుమతి సీఐ రెడ్డప్ప, ఎస్ఐ వీరేశ్ లు ప్రదానంచేశారు. సంక్రాంతి పండుగ ప్రాముఖ్యత గురించి సీఐ బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ దోణాసింగ్, సిబ్బంది నరసింహులు, రాజప్ప, శ్వేత,నాగరత్న,రేవతి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌గేట్ పిహెచ్‌సిలో గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు

**- గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ చేసిన ఎస్ఐకి ఘన సన్మానం**

**చేన్నేకొత్తపల్లి, జనవరి 12 ప్రభాతవార్త**


గర్భిణీ స్త్రీలకు అన్నం వడ్డిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని ఎన్ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిఎంఎస్ఎం ఏ సందర్భంగా సోమవారం డాక్టర్ రవినాయక్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకువైద్య పరీక్షలు నిర్వహిం చారు. అనంతరం వారికి మందులను అందజేశారు. గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలను సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం చెన్నేకొత్తపల్లి ఎస్సై ఆధ్వర్యంలో డాక్టర్ రవినాయక్ స్వయంగా 70మంది గర్భవతులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. అలాగే ఆసుపత్రి సిబ్బందికి భోజనాలు పంపిణీచేశారు. సికెపల్లి ఎస్ఐ సొంతఖర్చులతో ఏడాదిపాటు ప్రతినెల గర్భవతులకు పౌష్టికాహారం అందజేయడం జరుగుతుంది. దీంతోసోమవారం వైద్యాధికారి రవినాయక్‌ఆధ్వర్యంలో ఆస్పత్రిసిబ్బంది ఎస్సైను ఘనంగా సన్మానించారు.

## చిన్న వయసులో మృతి చెందడం అత్యంత బాధాకరం

**ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె**

**పుట్టపర్తి టౌన్, జనవరి 12, ప్రభాతవార్త**


మాజీ సింగల్ విండో అధ్యక్షుని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కమ్మవారిపల్లి కి చెందిన సింగిల్ విండో మాజీ అధ్యక్షులు గూడూరు ఓబులేసు కుమారుడు అరుణ్ కుమార్ సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి పల్లెరఘునాథ్ రెడ్డి కమ్మవారిపల్లి లోని గూడూరు ఓబులేసు కుటుంబాన్ని పరామర్శించారు. కొడుకు మృతి చెందడంతో శోకసంద్రం లో ఉన్న గూడూరు ఓబులేసు ,ఆయన సతీమణినీ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఓదార్చారు. గూడూరు అరుణ్‌కుమార్ అతిచిన్నవయసులో గుండెపోటుతో మృతి చెందడం అత్యంతబాధాకరమని వారు తీవ్రఆవేదన వ్యక్తంచేశారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే,మాజీ మంత్రి వెంట పుట్టపర్తి కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోఆర్డినేటర్ పోస్టుకు దరఖాస్తులు చేసుకోండి - ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రమీల

**శ్రీ సత్య సాయి జిల్లా (వైద్యము) జనవరి 12 ప్రభాతవార్త:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, ప్రపంచ బ్యాంకు సహకారంతో అమలవుతున్న నేషనల్ న్యూట్రిషన్ మిషన్ (పోషణ్ అభియాన్) ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న జిల్లా కోఆర్డినేటర్ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె. ప్రమీల తెలిపారు.ఈ నియామకం కాంట్రాక్ట్ ప్రాతిపదికన (కన్సాలిడేటెడ్ పే) జరుగుతుందని ఆమె వెల్లడించారు. దరఖాస్తులు ఈనెల 12 తేదీ నుండి19 వరకు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యర్థులు 01072025 నాటికి 25 సంవత్సరాలు పూర్తిచేసి, 42 సంవత్సరాల లోపు ఉండాలన్నారు.ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు 5 సంవత్సరాల వయోసడలింపు వర్తిస్తుందని పేర్కొన్నారు.జిల్లాలో మహిళలు, చిన్నపిల్లల పోషణాభివృద్ధి మరియు ఐసిడిఎస్ కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో జిల్లా కోఆర్డినేటర్ కీలక పాత్ర పోషిస్తారని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.మరిన్ని వివరాలకు జిల్లా మహిళ మరియు శిశు సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

## అనారోగ్యంతో వైసిపి కార్యకర్త మృతినివాళులర్పించిన వైసీపీ నేతలు

**బత్తలపల్లి, జనవరి 12 ప్రభాతవార్త**


కార్యకర్త మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నేతలు

మండలంలోని సూర్య చంద్రాపురం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త సాకే లక్ష్మీనారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న వైసిపి మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, దంపెట్ల సర్పంచ్ చల్లా కరుణాకర్ నాయుడు, వైస్ ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి తదితరులు సూర్యచంద్రపురం వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యకర్త మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్ కుటుంబంపై అభిమానంతో పార్టీ వెన్నంట నడిచిన కార్యకర్త పార్టీకి తీరని నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో వైసిపి నాయకులు ఈడిగ కాశప్ప,అక్కిం మునలప్ప, వెంకట్రాముడు,సూరి తదితరులున్నారు.

## కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి సిపిఐ మండల కార్యదర్శి


పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఐ నాయకులు

**సోమందేపల్లి జనవరి 12 ప్రభాతవార్త**

భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ముగింపు ఉత్సవాలు జనవరి 18న ఖమ్మంలో జరుగు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి, అంటూ మండల సిపిఐ కార్యదర్శి రాజగోపాల్ యాదవ్ పిలుపునిచ్చారు సోమవారం పార్టీ కార్యాలయంలో 2026 జనవరి 18 న ఖమ్మంలో లక్షలాది మందితో బహిరంగ సభకు హాజరుకానున్న 40 దేశ ప్రతినిధులు పాల్గొంటారని సిపిఐ నాయకులు కరపత్రాలు విడుదల చేశారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భారత గడ్డపై వందేళ్ల పూర్తి చేసుకున్నది భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ శతవసంత ఉత్సవాలు పార్టీ ఆవర్గించిన కాన్పూర్ 2025 డిసెంబర్ 26వన ప్రారంభమై దేశవ్యాప్తంగా ఉత్సవాలు జరుగుతున్నాయి బ్రిటిష్ వారి నుండి మన దేశ విముక్తి కొరకు రాజులేని పోరాటాలు చేస్తున్నందుకే ఆనాడు పార్టీపై నిషేధం విధించారు ఆనాడు పార్టీ నాయకులపై కుట్ర కేసులు పెట్టి నాయకులను జైల్లో నిర్బంధించారు అయినప్పటికీ కార్మిక విద్యార్థి యువజన రైతు మహిళ తదితర ప్రజాసంఘాలను నిర్మించి వెట్టి చాకిరి విముక్తి కొరకు కార్మికులు కర్షకులన దోపిడీ నుండి విముక్తి చేయడానికి రాజులేని పోరాటాలు సిపిఐ నిర్మించింది భారతదేశ చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నది భూమికోసం భుక్తి కోసం నిరంకుశ నిజాం ను గద్దె దించడానికి జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేలమంది ప్రాణ త్యాగాలతో 3000 గ్రామాల విముక్తికి పది లక్షల ఎకరాల భూమిని పంచి సిపిఐ పార్టీకి చాలా చరిత్ర ఉంది ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ పెనుగొండ నియోజకవర్గ నాయకులు బాలస్వామి, మండల కార్యదర్శి రాజగోపాల్ ,సహాయ కార్యదర్శులు ఎస్ చాంద్ భాష ,అంజనమ్మ. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## 14 సంవత్సరాల వయసుగల ఆడపిల్లల జాబితా సిద్ధం చేయండి

**- హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై శిక్షణా తరగతుల్లో వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌నాయక్**

**ఉరవకొండ, జనవరి 12 ప్రభాతవార్త**

ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి 14 సంవత్సరాల వయసుగల ఆడపిల్లల జాబితాలను తయారు చేయాలని వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌నాయక్ సూచించారు. మండల పరిధిలోని రాకెట్ల పీహెచ్‌సీలో సోమవారం హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌నాయక్ మాట్లాడుతూ హ్యూమన్ ప్యాపిలోమా వైరస్‌వల్ల మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వస్తోందన్నారు. త్వరలో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కూడా చేరుతుందని క్యాన్సర్ నివారణకు 14 సంవత్సరాల వయసుగల ఆడపిల్లలందరికీ ఈ వ్యాక్సిన్ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో నాగరంగయ్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, సూపర్‌వైజర్ శేఖర్, సీహెచ్‌వో, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 15న ఉరవకొండలో చౌడేశ్వరి అమ్మవారి జోతుల మహోత్సవం

**- వేరు వేరుగా వైభవంగా నిర్వహిస్తున్న దేవాంగులు, తొగటవీర క్షత్రీయులు - హాజరు కానున్న దయానందపురి స్వామీజీ, దివ్య జ్ఞానానందగిరి స్వామీజీ**


కోటలోని చౌడేశ్వరి అమ్మవారి మూలవిరాట్


పురమానుకట్ట చౌడేశ్వరి అమ్మవారి మూలవిరాట్

**ఉరవకొండ, జనవరి 12 ప్రభాతవార్త**

ఈనెల 15వ తేదీన సంక్రాంతి పండుగ రోజు ఉరవకొండ పట్టణంలో చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల మహోత్సవం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధల నడుమ జరుగనుంది. పట్టణంలోని చేనేత వర్గానికి చెందిన దేవాంగులు, తొగటవీర క్షత్రీయులు వేరు వేరుగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఉరవకొండ పట్టణంలోని చౌడేశ్వరి అమ్మవార్ల ఆలయాలకు వెళ్లే దారులన్నీ ఇప్పటికే ఎల్ఈడీ విద్యుత్ దీపకాంతుల స్వాగత తోరణాల స్వాగత ఫ్లెక్సీలతో నిండిపోయాయి. ఈనెల 15న గురువారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత జ్యోతులను ఎత్తి 16వ తేదీ శుక్రవారం ఉదయం వరకు పట్టణ వీధుల్లో జ్యోతులను ఊరేగించనున్నారు. దేవాంగుల ఆధ్వర్యంలో జరిగే జ్యోతుల ఉత్సవాలకు దేవాంగ కుల జగద్గురువు హంపి హేమకూట గాయ త్రి పీఠ మహా సంస్థానాధీశులు దయానందగిరి స్వామీజీ, తొగటవీర క్షత్రీయుల ఆధ్వర్యంలో జరిగే జ్యోతుల ఉత్సవాలకు అఖిల భారత తొగటవీర క్షత్రియ కుల గురువు పీఠాధిపతి దివ్య జ్ఞానానందగిరి స్వామీజీ ముఖ్య అతిధులుగా హాజరుకానున్నారు. జ్యోతుల మహోత్సవం సందర్భంగా ఉదయం నుండే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు.

## అర్చకున్ని ఆదుకోవాల్సిన ధర్మం అందరిపై ఉంది

**బుక్కపట్నం, జనవరి 12, ప్రభాతవార్త**


అనాథలైన చిన్నారులతో అర్చకులు హరి స్వామి

మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం అర్చకునిగా పనిచేస్తున్న పూజారి హరి స్వామి కుటుంబాన్ని ఆదుకోవాల్సిన ధర్మం అందరిపై ఉందని బుక్కపట్నం మండలం జనసేన నాయకులు అనిల్ కుమార్, సాయప్పగారి గణేష్ లు పేర్కొన్నారు. పురాతన లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో హరి స్వామి కుటుంబీకులు ఏళ్ల తరబడి అర్చకులుగా సేవలు అందిస్తున్నారన్నారు. 2012 సంవత్సరంలో దురదృష్టవశాత్తు ఆయన కుమారుడు మరణించడం జరిగిందని, 2023 లో ఆయన భార్య మృతి చెందగా, కుమార్తె అనారోగ్యం పాలవగా, 2025లో తన కుమార్తె భర్త మృతి చెందడంతో ఆవేదనను భరించలేక, బెంగతో షుగర్ వ్యాధి సోకి తన కుమార్తె కూడా ఈ ఏడాది 2026, జనవరి 03వ తేదీన మృతి చెందడం జరిగిందన్నారు. తన 7 సంవత్సరాల మనవడు, 12 సంవత్సరాల మనవరాలు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలయ్యారన్నారు. ఊరు బాగుండాలని నిత్య పూజలు చేసే పురోహితుని కుటుంబ సభ్యులు వరుసగా మృత్యువాత పడటంతో జీవనం అతలాకుతలం మైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు గ్రామంలోని ప్రతి ఒక్కరు ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని యువ నాయకులు పిలుపునిచ్చారు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

**గుత్తి, జనవరి 12 ప్రభాతవార్త**


వివేకానందుడికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలో సోమవారం బిజెపి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువతకు ఆదర్శంగా ఆయన ఇచ్చిన ప్రసంగాలు చాలా విలువైనవని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాయలసీమ ఇన్‌చార్జ్ తిమ్మారెడ్డి, కార్యదర్శి నూరుల్‌హసన్‌బాష, ప్రేమ్‌కుమార్, కందుల హేమలత, వలిబాష, బాలకృష్ణ, జనార్ధన్, మనోజ్‌కుమార్, పవన్‌కుమార్, ఓబులేష్, శ్రీరామ్, షాషావలి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాష్ట్ర పెన్షనర్ల కార్యాలయంలో కోశాధికారి జన్నె కుళ్లాయిబాబు, ఉపాధ్యక్షులు షెక్షావలి ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు, మరియు డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో... ఉత్తమ ప్రతిభలో బూదిలివాసులు

**- ఎంపిడిఒ కమలాబాయి చేతుల మీదుగా పంచాయతీ కార్మికులకు, ఈడిగ రవికి సత్కారం**

**గోరంట్ల, జనవరి 12 ప్రభాతవార్త**


సన్మానిస్తున్న ఎంపిడిఒ

రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి సేకరించిన అభిప్రాయాల మేరకు ఉత్తమ ప్రతిభకనబరిచి పెనుకొండనియోజకవర్గంలో మూడవ స్థానంలో నిలిచి మంత్రి సవితమ్మ చేతుల మీదుగా సన్మానం పొందిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఈడిగ రవిగౌడ్, పంచాయతీ కార్మికులను సోమవారం ఘనంగా సన్మానించడం జరిగినది. సంక్రాంతి సందర్భంగా నూతనవస్త్రాలు, శాలువాలు,పూలమాలలతో ఘనంగా సత్కరించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కమలాబాయి, టిడిపి సీనియర్ నాయకులు గంధం శ్రీరామ్, టిబి నటరాజప్ప, వెట్టి రామచంద్ర, డీలర్ ఈశ్వర, బూత్ కన్వీనర్ జమీర్‌అస్లాం, గంధం చంద్ర, ఈడిగ బాలయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, మండల ఎస్‌సి సెల్ కన్వీనర్ బూదిలి లక్ష్మీపతి, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బోయ వెంకటేష్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు అడ్మిషన్లు అరికట్టడంలో అధికారులు విఫలం

**-ఎంఈఓ కార్యాలయం ముందు పీడీఎస్‌యు ధర్నా**

**గుంతకల్లు, జనవరి 12 ప్రభాతవార్త**


ఎంఈఓ సుబ్బారాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలు నిర్వహిస్తున్న ముందస్తు అడ్మిషన్లు అరికట్టడంలో మండల విద్యాధికారులు పూర్తిగా విఫలమయ్యారని పీడీఎస్‌యు నియోజకవర్గ కార్యదర్శి వినోద్ పేర్కొన్నారు. సోమవారం ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం పూర్తి కాకముందే కొన్ని విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు జరుపుతున్నారన్నారు. విద్యాహక్కు చట్టాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా గడపగడపకు తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అడ్మిషన్లు సేకరిస్తున్నారని పేర్కొన్నారు. అడ్మిషన్లు అరికట్టాల్సిన అధికారులు వారితో కుమ్మక్కై చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అనంతరం మండల విద్యాధికారి సుబ్బారాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్, సాయి, పవన్, జగన్నాథ్, హర్ష, వైభవ్ పాల్గొన్నారు.

## చైల్డ్ ఫండ్ ఇండియా వారిచే... పల్లెల్లో వైద్య శిబిరం

**-వ్యాధుల నివారణ ముందస్తు జాగ్రత్తపై ప్రజలకు అవగాహన**

**గోరంట్ల, జనవరి 12 ప్రభాతవార్త**



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మరియు నివారణ విభాగం ఆదేశాల మేరకు గోరంట్ల మండలం కమ్మవారిపల్లి గ్రామంలో కొండాపురం పిహెచ్‌సి. సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం వారు సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరిగి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుప్రీత మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. జోనల్ సూపర్ వైజర్ వెంకట్ మాట్లాడుతూ ఎచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ హెచ్ఐవి ఎలా వస్తుంది, ఎలా రాదు, వచ్చిన వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. అలాగే ప్రతి ఒక్కరూ హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలన్నారు. పిఎచ్ఎన్ రమాదేవి మాట్లాడుతూ బి.పి, షుగర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పిస్తూ అవి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. అలాగే టి.బి గురించి అవగాహన కల్పిస్తూ టి.బి. యొక్క లక్షణాలు గురించి అవగాహన కల్పించారు. అనంతరం హెచ్ఐవి పరీక్షలతో పాటు బిపి, షుగర్, హెచ్.బీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండాపురం పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుప్రీత, పిఎచ్ఎన్ రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పి శిల్పా, ఎంపిహెచ్ఎస్ గంగమ్మ, ఎంపిహెచ్ఎ ఈశ్వరమ్మ, ఏఎన్ఎం రాధమ్మ, గంగాదేవి, జోనల్ సూపర్ వైజర్ వెంకట్, లింక్ వర్కర్స్ శేఖర్, శిల్పా, సర్పంచు చేపట్ల మణి, ఆశా వర్కర్లు అనూషా, గౌరమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గోరంట్ల బిజెపి కార్యాలయంలో... వివేకానందుని జయంతి కార్యక్రమాలు

**- పాల్గొన్న రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జిఎం సురేష్**

**గోరంట్ల, జనవరి 12 ప్రభాతవార్త**


జయంతి కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

గోరంట్ల మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో భారత దేశ ఔన్నత్యాన్ని హిందూ ధర్మ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానందుడని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జిఎం సురేష్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు గోరంట్ల మోహన్ శేఖర్ ఆదేశాల మేరకు వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ, శ్రీసత్యసాయి జిల్లా జాతీయ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జిఎం సురేష్, మేదర శ్రీనివాసులు, సింగిల్ విండో డైరెక్టర్ పూల గంగాధర్, వెంకటాచలం, కాచర్ల హరీష్, భజంత్రీ శంకర, కాటేపల్లి నరేష్, షబ్బీర్, పాల్గొన్నారు.

## గేట్స్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**గుత్తి, జనవరి 12 ప్రభాతవార్త**


భోగి మంటలు వేస్తున్న దృశ్యం

గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో సోమవారం ముందస్తు మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో హాజరై కళాశాల ప్రాంగణాన్ని గ్రామీణ సంస్కృతితో నింపారు. వేడుకల్లో భాగంగా కళాశాల ఎండి రఘునాథరెడ్డి భోగి మంటలు వేసి అలరించారు. విద్యార్థులు కోలాట ప్రదర్శన, విద్యార్థి హరిదాసు సాంస్కృతిక కార్యక్రమాలతో కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ వికె పద్మావతి, ప్రిన్సిపాల్ డాక్టర్ నమ్రత, పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలి

**-స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య**

**పుట్టపర్తి (కల్చరల్), జనవరి 12, ప్రభాతవార్త**

ప్రతి సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రజల సంతృప్త స్థాయి పెరిగేలా నాణ్యతగా పరిష్కరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఎస్డీసీ రామసుబ్బయ్య ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 256 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించాలని అధికారులకు సూచించారు.


ప్రజలను అర్జీలను స్వీకరిస్తున్న దృశ్యం

09ATP27_09ATP27.qxd 12-01-2026 PM 10:23 Page 1



## 19న మండల సర్వ సభ్య సమావేశం

అగళి, జనవరి 12 ప్రభాతవార్త

ఈ నెల 19వ తేది సోమవారం 10:30 గంటలకు అగళి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ గంగాధర్, ఏఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ సర్వ సభ్య సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఎంపిపి, జడ్పిటిసితలతోపాటు ఎంపిటిసిలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

## ఎంపిపి, జడ్పిటిసిలను సన్మానించిన ఫీల్డ్ అసిస్టెంట్

అగళి, జనవరి 12 ప్రభాతవార్త



సన్మానిస్తున్న దృశ్యం

అగళి విబిజిరాంజి ఉపాధిహామీ పథకంలో అగళి పంచాయితీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నగేష్ ఆత్మీయంగా ఎంపిపి రేణుకా కామరాజు, జడ్పిటిసి ఉమేష్, సింగిల్ విండో అధ్యక్షులు కుమారస్వామి, జిల్లా తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్‌మూర్తి, కన్వీనర్‌తిప్పేస్వామి, మాజీఎంపిపి నరసింహయ్య, శివన్న, కిష్టప్ప, షౌకతలి, ఎంపిటిసి చంద్రప్ప, నాయకులు దేవరాజు, చిగనాగప్ప తదితరులను అగళి ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో పూలమాలలతో దుశ్శాలువాతో సన్మానించారు. ప్రత్యేక అభిమానంతో సన్మానం చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ నగేష్‌ను అభినందించారు. కొత్తగా ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా చేరిన సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమం జరిగింది.

## సంక్రాంతి సందర్భంగా మెగా దుస్తుల దుకాణం ప్రారంభం

అమరాపురం జనవరి 12 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని వైయస్సార్ సర్కిల్ సమీపంలో ఏపీ 39 ఫ్యాషన్ స్ట్రీట్ షాపు నందు పురుషులకు సంక్రాంతి మెగా ఆఫర్ తో బట్టలను అమ్మడానికి ప్రారంభించినట్లు షాప్ యజమాని వీర వర్ధన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ బట్టలు వేయి రూపాయలకు నాలుగు షర్టు, వేయి రూపాయలకు3 నైట్ ప్యాంట్లు, వేయి రూపాయలకు రెండు జీన్స్ ప్యాంట్లు, వేయి రూపాయలకు నాలుగు టీ షర్టు ఆఫర్ల కింద అమ్మబడునని అమరాపురం పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ మెగా షో రూమ్ లో బట్టల ఆఫర్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## సంక్రాంతి సంబరాల ఏర్పాట్ల పరిశీలన

ధర్మవరంటౌన్, జనవరి 12 ప్రభాతవార్త



క్రీడామైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించే సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీల సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సోమవారం బీజేపీనేత హరీశ్ బాబు పరిశీలించారు. ఈ నెల 14,15 తేదీలలో ఉదయం 530గటంటల నుండి భోగిమంటలతో పాటు సంక్రాంతి సంబరాలు, అదేవిధంగా నియోజకవర్గ ఆడపడచులకు ముగ్గులపోటీలు, సాంస్కృతికకార్యక్రమాలు జరుగుతాయని హరీశ్‌బాబు తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య సినీహీరో సాయికుమార్, గాయకుడు గజల్ శ్రీనివాసులు హాజరవుతారన్నారు. ఈసంబరాలలో నియోజకవర్గంలోని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఆలదపల్లి ప్రజల దాహార్తి తీర్చిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

అమరాపురం జనవరి 12 ప్రభాతవార్త



త్రాగునీరు బోర్ ప్రారంభిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని ఆలదపల్లి గ్రామం నందు ప్రజల దాహార్తి తీర్చడానికి స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుల విన్నపం మేరకు మడకశిర ఎమ్మెల్యే సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల ఆధ్వర్యంలో ప్రజలకు త్రాగునీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక బోర్ వేశారు. స్థానిక గ్రామపంచాయతీ అధికారులు మరియు టిడిపి నాయకులు బోర్ వెల్ కు మోటార్ బిగించడంతో సమృద్ధిగా బోర్‌వెల్‌నందు నీరురావడంతో సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కేఎన్ఎం నరసింహమూర్తి, టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, మండల ప్రధానకార్యదర్శి ఎంనాగరాజులు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ప్రజల త్రాగునీటి సమస్య తీర్చడానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా ముందుంటుందని ప్రజల సమస్యలు పరిష్కారమే ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీల సంకల్పమని ప్రజలు వీరికి ఎల్లవేళలా అండగా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అమరాపురం జడ్పిటిసి పి ఆర్ నరసింహమూర్తి, మండల క్లస్టర్ కో కన్వీనర్ కనకనపల్లి మంజుతారక్, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చెన్నప్ప, విరుపసముద్రం మంజునాథ్, మాజీసర్పంచులు ఫాండురంగప్ప,చంద్రప్ప, పంచాయితీ టిడిపి కన్వీనర్ యంజారప్ప, మాజీ ఎంపిటిసి నరసింహప్ప, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు గిరిరాజు, శ్రీనివాస్, మాజీ డీలర్ శ్రీనివాస్, జయన్న, గోపాలప్ప, సిద్ధప్ప, భూతన్న, కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## రాతి గుండ్లు జారుతున్నాయి..మాకు మరొక చోట ఇంటి స్థలాలివ్వండి

- పీజీఆర్ఎస్‌లో విన్నవించిన పట్టణంలోని 12వ వార్డు ప్రజలు

ఉరవకొండ, జనవరి 12 ప్రభాతవార్త



డిప్యూటీ తహశీల్దార్ భోగనగౌడ్‌కు వినతిపత్రం అందిస్తున్న పట్టణంలోని 12వ వార్డు ప్రజలు

పట్టణంలోని 12వ వార్డు ఎల్లమ్మ గుడి పక్కన కొండపై నుండి భారీ గుండ్లు జారుతున్నాయని తాము బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లబుచ్చుతున్నామని తమకు మరొక చోట ఇంటిస్థలాలు మంజూరు చేస్తే అక్కడ ఇళ్లు నిర్మించుకుంటామని ఆ ప్రాంతానికి చెందిన మహిళలు మమత, రామలింగమ్మ, భాగ్యమ్మ, పోతమ్మ, నాగలక్ష్మి తదితరులు విన్నవించారు. పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వారు డిప్యూటీ తహశీల్దార్ భోగనగౌడ్‌కు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 1వ తేదీన ఎల్లమ్మ గుడి ప్రాంతంలో కొందరు పిల్లలు ఆడుకొంటుండగా కొండపై నుండి పెద్ద రాతి గుండ్లు జారగా అమీన్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడన్నారు. ఇలాంటి ఘటనలు ఇక్కడ మరిన్ని జరిగే ప్రమాదం ఉందన్నారు. రాతి గుండ్లు నివాసగృహాలపై పడితే ప్రాణ, ఆస్తినష్టం భారీగా ఉంటుందని తమకు మరొకచోట ఇంటి స్థలాలు మంజూరు చేయాలని విన్నవించారు.

## పుట్టపర్తిలో కోలాహలంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

వందల సంఖ్యలో పాల్గొన్న మహిళలు




చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి, నిర్వాహకులు రమేష్, ప్రదీప్

పుట్టపర్తి టౌన్, జనవరి 12, ప్రభాతవార్త

పుట్టపర్తి పట్టణంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రముఖ బిల్డర్ సాయి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలలో మహిళలు వందల సంఖ్యలో పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటక నాగేపల్లి వద్ద గల అమూల్య విల్లాస్ ప్రాంగణంలో సోమవారం ముగ్గుల పోటీలు జరిగాయి. పుట్టపర్తి పట్టణంతోపాటు సమీప గ్రామాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో రిజిస్టర్ చేసుకొని ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. వివిధ రకాల రంగులతో కూడిన చిత్రాలను మహిళలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వేశారు. దాదాపు 500 మంది మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొని పెద్ద సంఖ్యలో ముగ్గులు వేయగా పలువురు న్యాయ నిర్ణేతలు ముగ్గులు బాగా వేసిన 20 మందిని ఎంపిక చేశారు. వారిలో ప్రథమ బహుమతి లలిత అనే మహిళ ఎంపిక కాగా ఆమెకు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చేతులమీదుగా లక్ష రూపాయల చెక్కును నిర్వాహకులు సాయి రమేష్ అందజేశారు. అదేవిధంగా సాకే రామలక్ష్మి అనే మహిళకు ద్వితీయ బహుమతి ద్వారా 50,000, బుక్కపట్నం మండలంలోని జానకంపల్లి గ్రామానికి చెందిన జయశ్రీ అనే మహిళకు మూడో బహుమతి ద్వారా 25 వేల చెక్కును అందజేశారు. మరో 17 మంది మహిళలకు ప్రోత్సాహక బహుమతుల ద్వారా 5000 రూపాయల చొప్పున అందజేశారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి మహిళకు ఒక బహుమతిని అందజేసినట్టు నిర్వాహకులు సాయి రమేష్ పేర్కొన్నారు. సంక్రాంతి ముగ్గుల పోటీల సందర్భంగా వివిధ రకాల వేషధారణలతో నిర్వహించిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సాంప్రదాయబద్ధంగా గతం నుంచి వస్తున్న కళలు అంతరించిపోకుండా వాటికి జీవం పోసే విధంగా పోటీలు నిర్వహించిన నిర్వాహకులు సాయి రమేష్ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తో పాటు పలువురు అభినందించారు.

## కోడికి కత్తులు కట్టవద్దు

బత్తలపల్లి, జనవరి 12 ప్రభాతవార్త

సంక్రాంతి పండుగను పురష్కరించుకొని కోడి పందేలు నిర్వహించేందుకు కత్తులు కట్టి కష్టాలు తెచ్చుకోవద్దనిధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐఐ సోమశేఖర్ హెచ్చరించారు. సోమవారం వారు బత్తలపల్లి పోలీస్ "స్టేషన్లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైకోర్టు వెలువరించిన ఆదేశాల మేరకు గేమింగ్ యాక్ట్ కింద జంతువులను క్రూరంగా హింసించరాదని ఉత్తర్వులు ఉన్నాయన్నారు. మండలంలో తహసీల్దార్, పశువైద్యాధికారి, ఎస్ఐలతో మండల కమిటీ ఉంటుందని, పంచాయతీల్లో పోలీసులు, ఆయా గ్రామాల సర్పంచులు, విఆర్ఓలు, వెలుగు సిబ్బంది ఉంటారన్నారు. ఆయా గ్రామాల సమాచారం ఎప్పటికప్పుడు తమకు చేరుతుంటుందన్నారు. ఎవరైనా కోడి పందేలు నిర్వహించే ప్రదేశంలో భూ యజమానిపైన కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడి కాళ్లకు కత్తులు కట్టి పోటీలను రక్తసిక్తం చేస్తే హైకోర్టు ఆదేశాల మేరకు తీవ్రంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా కోడి పందేలు ఆడుతూ పట్టుబడితే శిల్లతోపాటు రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండుగను ఆనందాల మధ్య కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని సూచించారు.

## ఓంకారేశ్వరుని ఆలయంలో అన్నదానం ప్రారంభం

బత్తలపల్లి, జనవరి 12 ప్రభాతవార్త





అన్నదానం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ శాశ్వత ధర్మకర్త కోటి సూర్యప్రకాష్ బాబు

ఓంకారేశ్వరుని ఆలయంలో పూజలు అందుకుంటున్న ఓంకారేశ్వరుడు

మండలకేంద్రమైన బత్తలపల్లిలోని ఓంకారేశ్వరుని ఆలయంలో సోమవారంనుండి మహాశివరాత్రివరకు శివమాలదారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త కోటి సూర్యప్రకాష్ బాబు తెలిపారు. సోమవారం బత్తలపల్లిలోని తాడిపత్రి రహదారి యందు అధునాతనంగా నిర్మించిన శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరుని ఆలయంలో బత్తలపల్లికి చెందిన చిట్రా పుల్లయ్య కుమారుడు చిట్రా వంశీ కుటుంబీకులు శివ మాలదారులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టగా ఆలయ ధర్మకర్త కోటి సూర్యప్రకాష్ బాబు ప్రారంభించారు. అంతకు మునుపు ఓంకారేశ్వరునికి ప్రత్యేక పూజలు ఆలయ అర్చకుడు రాజేష్ నిర్వహించారు. నిర్వహించారు. ఆలయంలో గణపతిపూజ అనంతరం శివ మాలదారులకు బిక్ష ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పలువురు మాలలు ధరించిన శివ స్వాములు తరలివచ్చి అన్నదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కోటి సూర్యప్రకాష్ బాబు మాట్లాడుతూ నేటి నుండి మహాశివరాత్రి వరకు దాదాపు నెల రోజులపాటు ఓంకారేశ్వరుని ఆలయంలో మధ్యాహ్నం బిక్ష కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని శివస్వాములు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తి పార వశ్యంలో ఓంకారేశ్వరున్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి రామంజి, శివస్వాములు మాలదారులు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన పోరాటం చేసే పార్టీ సీపీఐ



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ జిల్లాకార్యదర్శి,నాయకులు

ధర్మవరంటౌన్, జనవరి 12 ప్రభాతవార్త

ప్రజల పక్షాన పోరాటం చేసే పార్టీ సీపీఐ అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ అన్నారు. సీపీఐ 100 సంవత్సరాల శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఖమ్మంలో ఈ నెల 18న జరుగుతాయని ఈ సభను విజయవంతం చేయాలని ఆయన ఖిపిలుపు నిచ్చారు. ఈ మేరకు సోమవారం ధర్మవరంలో ఖమ్మం సభకు సంబంధించిన కరపత్రాలను సీపీఐ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వేమయ్యయాదవ్ మాట్లాడుతూ... ఈనెల 17న ధర్మవరం నుంచి ఖమ్మంకు సీపీఐ ప్రత్యేక రైలు ఏర్పాటు చేసిందన్నారు. శతాబ్ద కాలంలో సీపీఐ ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిందన్నారు. పోరాటాల ద్వారా దేశం లోనే అనేక కార్మిక సంక్షేమచట్టాలను సాదించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగుమధు, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జింకాచలపతి, సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, చేనేత కార్మికసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనారాయణ, వెంకటస్వామి, చేతివృత్తిదారుల సంఘం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద ఆశయాలను కొనసాగిద్దాం

ధర్మవరంటౌన్, జనవరి 12 ప్రభాతవార్త



వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీనాయకులు

స్వామి వివేకానంద ఆశయాలను కొనసాగిద్దామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబుళేశు పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం 164వ స్వామి వివేకానంద జయంతిని సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ....వివేకానంద జయంతి సందర్భంగా ప్రతి ఏటా జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. 1893లో షికాగోలో జరిగిన సర్వమత సమ్మేళనంలో ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామివివేకానంద అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి డోలారాజారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యకులు గొట్లూరు అనిల్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగరత్నమ్మ,ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఓంప్రకాశ్ గౌడ్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు మహేశ్, నాయకులు చంద్రమోళి, జింకాప్రవీణ్ పాల్గొన్నారు.

## రైతులను బెదిరించిన గవి సిద్ధేశ్వర ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

రాయదుర్గం జనవరి 12 ప్రభాతవార్త

రాయదుర్గం మండల పరిధిలోని రాయల్ పల్లి గ్రామ సమీపంలో ఉన్నటువంటి గవి సిద్దేశ్వర స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ నుండి వెలువడే కాలుష్యం మా పంటలపై పడి మా పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని, దీనివల్ల మేము పూర్తిగా నష్టపోతున్నామని, మాకు న్యాయం చేయమని అడిగేందుకు వెళ్లినటువంటి రైతాంగంపై బెదిరింపులకు పాల్పడిన గవిసిద్దేశ్వర స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి కాలుష్యం వల్ల పంటలు నష్టపోతున్న రైతులకు ఫ్యాక్టరీ యాజమాన్యం న్యాయం చేయాలని, ప్రతి ఎకరాకు పంట నష్టపరిహారం కింద 50 వేల రూపాయలను ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందర గంట పాటు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీతాసిల్దార్ శ్యామ్‌కి అందజేశారు. ఈ సందర్భంగా బి మల్లికార్జున మాట్లాడుతూ, గవిసిద్దేశ్వర స్వామి ఐరన్ ఫ్యాక్టరీనుండి వెలుగడుతున్న కాలుష్యంనుండి ఆఫ్యాక్టరీచుట్టూ ఉన్నటువంటి ఉడేగోళం అయతపల్లి బీసీకాలనీలలోని రైతుల పండిస్తున్నటువంటి పంటలు కాలుష్యం వల్ల దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈకాలుష్యం చుట్టుపక్కల ఉన్నటు వంటి గ్రామాలలోని త్రాగునీటిలో కలిసి ఆ త్రాగునీటిని త్రాగి ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. అలాగే తమ పంటలకు జరుగుతున్న నష్టం పై అడిగేందుకు రైతన్నలు వెళితే అక్కడున్నటువంటి మేనేజర్ గౌస్ అనే వ్యక్తి రైతులను బెదిరిస్తూ మీకు ఒక్క రూపాయి కూడా చెల్లించే ప్రసక్తే లేదని ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ రైతులపై దౌర్జన్యానికి పాల్పడటాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. తక్షణమే ఆ మేనేజర్ గౌస్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీ కాలుష్యం వల్ల ఇంత పెద్దఎత్తున రైతులు పంటలను నష్టపోతున్న రెవెన్యూ అధికారులు, కాలుష్య నియంత్రణ అధికారులు మాత్రం కనీసం ఆ గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయమని అన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వలనే ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులపై ఈవిధంగా దౌర్జన్యానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రెవెన్యూ, కాలుష్య నియంత్రణ అధికారులు వ్యవసాయ శాఖ అధికారులు ఆగ్రామాలను సందర్శించి ఆగ్రామాలలోని రైతులు నష్టపోతున్నటువంటి పంటను పరిశీలించి వారికి తగిన న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆరైతులకు న్యాయం జరిగే వరకూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలలోని రైతులందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఫ్యాక్టరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు మధు తిమ్మరాజురవిరమేష్ వంశీకృష్ణబాబు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలో చేసిన పనులకు బిల్లులు చెల్లించండి ప్రభు!

అమరాపురం జనవరి 12 ప్రభాతవార్త

మండలంలోని గ్రామపంచాయతీలలో స్థానిక సర్పంచులు చేసిన వివిధ పనులకు గత రెండు మూడునెలలుగా బిల్లులను గ్రామపంచాయతీ కార్యదర్శులు మరియు మండల పరిషత్ అధికారులు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని ఆయా గ్రామపంచాయతీల సర్పంచులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో ప్రజలకు అత్యవసరమైన త్రాగునిటి వ్యవస్థ, పైప్ లైన్ల ఏర్పాటు, విద్యుత్ వ్యవస్థలో భాగంగా విద్యుత్ దీపాల ఏర్పాటు, డ్రైనేజ్ వ్యవస్థ తదితర కార్యక్రమాలను నిర్వహించిన సర్పంచులకు బిల్లులు మంజూరులో అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కాలేని పరిస్థితి మండలంలో నెలకొన్నదని కొందరు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ధోరణి ఇలానే కొనసాగితే తాము న్యాయస్థానాలను కూడా ఆశ్రయించడానికి ప్రయత్నిస్తామని కొందరు సర్పంచులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు తాము చేసిన పనులకు బిల్లులు చెల్లించి న్యాయం చేయాలని కోరుచున్నారు.

## ఘనంగా స్వామి వివేకానందుని 163వ జయంత్సోవం

- చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి

ఉరవకొండ, జనవరి 12 ప్రభాతవార్త



స్వామి వివేకానందుని చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భారతదేశ ప్రఖ్యాత హిందూ యోగి, ఆధ్యాత్మిక గురువు వేదాంత, తత్వశాస్త్ర వేత్త స్వామి వివేకానందుని 163వ జయంత్సోవం సోమవారం ఉరవకొండ పట్టణంలో ఘనంగా జరిగింది. స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలవేసి పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేజర్ గ్రామ పంచాయతీ సీనియర్ ఎలక్ట్రీషియన్ యు.గోపాల్ తదితరులు మాట్లాడుతూ రామకృష్ణ పరమహంస శిష్యుడైన వివేకానందస్వామి భారతదేశపు ఆధ్యాత్మిక వారసత్వాన్ని పశ్చిమ దేశాలకు పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ముఖ్యంగా 1983లో జరిగిన ప్రపంచ మతాల పార్లమెంటులో ఆయన ప్రసంగం ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. స్వామి వివేకానందుని బోధనలు, రచనలు దేశభక్తిని, విద్య, సామాజిక సంస్కరణలు, యువత సాధికారితను ప్రతిబింబించాయన్నారు. ఆయన జన్మదినాన్ని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకొంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో నిరంజన్‌గౌడ్, ఓబులేసు, మోపిడి గోపాల్, చంద్ర, నాగన్నగౌడ్, భీమలింగ, వెంకటేశులు, అనీల్, చంద్రశేఖర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## జూదాలు ఆడరాదు - పతంగులు ఎగురవేసేవారు జాగ్రత్తలు తీసుకోవాలి

-అర్బన్ సిఐ రామారావు

గుత్తి, జనవరి 12 ప్రభాతవార్త

సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషంగా నిర్వహించుకోవాలని అర్బన్ సిఐరామారావు పేర్కొన్నారు. సోమవారం ఆయనవిలేకరులతో మాట్లాడుతూ చట్ట వ్యతిరేకంగా పేకాట, కోడి పందేలు, పొట్టేలు పందేలు ఆడరాదని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా పిల్లలు పతంగులు ఎగురవేసేటప్పుడు మిద్దెల పైన కరెంటు తీగలు లేకుండా చూసుకోవాలన్నారు. పైనుండి కింద పడకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంరక్షకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

## వివేకానంద సూక్తులు స్ఫూర్తిదాయకం

హిందూపురం జనవరి 12 ప్రభాతవార్త



వివేకానంద విగ్రహానికి పూలమాల వేసే నివాళి అర్పిస్తున్న దృశ్యం

స్వామి వివేకానంద సూక్తులు ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని ఇండియా మూవ్ ఎన్జీవో చైర్మన్ ఆచార్య అజిత్ కుమార్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సోమవారం హిందూపురం సమీపంలోని బిట్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అజిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు ఏర్పరచుకోవాలని సూచించారు. యువతే దేశ అభివృద్ధికి ప్రధాన శక్తిగా నిలుస్తుందని డిజిటల్ యుగంలో సాంకేతికతను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించుకున్నప్పుడే సానుకూల మార్పులు రూపకల్పమవుతాయని తెలిపారు. అనంతరం సహజ నందగిరి స్వామీజీ మాట్లాడుతూ నిస్వార్థ సేవ మానవ విలువలు ప్రతి వ్యక్తిలో దైవత్వాన్ని చూడగల దృష్టి యువతకు ఆధ్యాత్మిక స్థిరత్వంతో పాటు మానసిక సామర్థ్యాన్ని పెంచుతాయని చెప్పారు. కళాశాల చైర్మన్ చంద్రమోహన్ మాట్లాడుతూ స్వామి వివేకానంద నేటి యువతకు ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

## ఆయూర్ ఆధ్వర్యంలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి

- వ్యాసరచన, వకృత్వ, యోగా పోటీల్లో విజేతలకు సర్టిఫికేట్ల పంపిణీ

ఉరవకొండ, జనవరి 12 ప్రభాతవార్త



యూత్ ఐకాన్ అవార్డులను అందజేసి సన్మానించిన దృశ్యం



విద్యార్థులకు సర్టిఫికేట్లను అందించిన దృశ్యం

పట్టణంలోని లయన్స్‌క్లబ్ స్టడీ, యోగా కేంద్రంలో సోమవారం ఆయూర్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 163వ జయంతి, జాతీయ యువజనోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వివేకానంద జీవిత విశేషాలపై విద్యార్థులకు మూడు విభాగాల్లో వ్యాసరచన, వకృత్వ, యోగా పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. ఈక్రమంలోనే మంచి ప్రవర్తన, క్రమశిక్షణ, సేవ, చదువులలో రాణించిన యువతను ప్రోత్సహించడంలో భాగంగా ఒకే డీఎస్సీలో ఐదు ఉద్యోగాలు సాధించిన రొద్ద శ్రీనివాస్, రక్తదాత మోహన్, డిగ్రీ చదువుతూ ఎన్ఎస్ఎస్‌లో ఉత్తమ సేవలు అందిస్తున్న విద్యార్థిని సాయి జోత్స్న, ఒకవైపు చదువుకొంటూ మరొకవైపు సాయంత్రం సమయంలో ఉచిత ట్యూషన్ చెబుతూ నిస్వార్థ సేవలందిస్తున్న తరుణ్‌కుమార్‌లకు యూత్ ఐకాన్ అవార్డులను ప్రధానంచేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ యువత దేశభక్తిని కలిగి ఉండాలని, స్వామి వివేకానందున్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయుర్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాటికొండ వెంకట్, ఈశ్వరీయ బ్రహ్మకుమారీ పుష్ప అక్క, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు బి.లక్ష్మినారాయణ, రీజినల్ చైర్మెన్ టి.గణేష్‌బాబు, సభ్యులు యం.సి.నాగభూషణ, జి.కె.శ్రీధర్, సి.నాగేశ్వరరావు, ఇ.శ్రీరాములు, ఆయుర్ ప్రతినిధులు చంద్రమోహన్, శంకరయ్య, శ్రీనివాస్, శ్రీదేవి, శైలజ, పద్మావతి, రాధ, మౌనిక, పృదిజ్వ తదితరులు పాల్గొన్నారు.

## పాలసముద్రం కేంద్రీయ విద్యాలయంలో... అడ్వాన్స్ సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

గోరంట్ల, జనవరి 12 ప్రభాతవార్త

గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద వున్న కేంద్రీయ విద్యాలయంలో సోమవారం ముందస్తు సంక్రాంతి పండుగను సాంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం సంస్కృతీ సాంప్రదాయాలతో కళకళలాడింది. విద్యార్థులందరూ సంక్రాంతి పండుగకు సంబంధించిన వివిధ ఆచారాలు, సాంప్రదాయాలను నాటికలు (డ్రామాసీన్లు), నృత్యాలరూపంలో ఎంతోఅద్భుతంగా ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలు ప్రేక్షకులనుఆకట్టుకుని పండుగవైభవాన్ని స్పష్టంగా ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి.కృష్ణారావు పాల్గొని సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ఇది రైతుల పండుగగా, కృతజ్ఞత, ఐక్యత మరియు సంస్కృతి విలువలను తెలియజేసే ముఖ్యమైన పండుగగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక విలువలను పెంపొందించడంతోపాటు, మన సాంప్రదాయాల పట్ల గౌరవాన్ని మరింత బలపరిచింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, పిటి కోచ్ షీమా సర్తాజ్, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## బయనపల్లి, బసవన్నపల్లి గ్రామాల్లో ఆర్థిక నేరాలపై అవగాహన




గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న రూరల్ సిఐ, లేపాక్షి ఎస్ఐ

లేపాక్షి, జనవరి 12 ప్రభాతవార్త

మండల పరిధిలోని బయనపల్లి, బసవన్నపల్లి గ్రామాల్లో సోమవారం హిందూపురం రూరల్ సిఐ నేతృత్వంలో ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో దొంగతనాలు ఆర్థిక నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు ఇతర ప్రదేశాలకు వెళ్లేటప్పుడు ఇళ్ళకు తాళాలు వేసి వెళ్లాలన్నారు. బయట ప్రదేశాలకు వెళ్లే పరిస్థితులలో చుట్టుపక్కల ఇళ్లవారికి సమాచారం అందించి వెళ్లాలన్నారు. అప్పుడే దొంగతనాలు తగ్గేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళా చట్టాలు కఠినంగా ఉన్నాయన్నారు. మహిళల పట్ల గౌరవంగా ఉండాలని, వారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. అదేవిధంగా భూములకు సంబంధించిన విషయంలో తగాదాలు పడరాదని, పెద్దల సమక్షంలో తీర్మానం చేసుకోవాలన్నారు. ఆ పరిస్థితి లేనప్పుడు పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

